కథ

# తప్పిపోయిన కూతురు

జి. లక్ష్మి
94907 35322

''నేను అబార్షన్ చేయించుకున్నాను. రెండు నెలలైంది''.. వంటింటి గుమ్మానికి ఆనుకుని ధీర చెప్పింది వినగానే.. ఒక్కక్షణం అయోమయంగా అనిపించింది. తలెత్తి ధీర మొహంలోకి చూశాను. అలాగే నిశ్చలంగా చూస్తోంది. ఎంత కాజువల్గా.. ఎంత ఉదాసీనంగా.. గొంతులో ఎలాంటి భావమూ లేకుండా.. అదేదో తన శరీరం కానట్టు ఎలా చెప్పింది అది? చెప్పటం కాదు.. అది ఒక స్టేట్మెంట్. అంతే!

ఏదైనా జరుగుతుందేమోనన్న భయం మనల్ని భయపెట్టినంతగా.. అది జరగడం అంత భయపెట్టదు. నిజంకన్నా ఊహే ఎప్పుడూ భయంకరంగా ఉంటుందేమో. నిజానికి నా గుండె బద్దలవ్వాలేమో! కానీ, చిత్రంగా నా గుండె ముక్కలేమీ అవలేదు. ఇంకా చెప్పాలంటే ఏదో భారం దిగిపోయినట్టుగా ఉంది. ఇది ఇట్లాగే జరుగుతుందని.. ఇలా కాకుండా ఇంకోలా జరిగినా, చివరికి అదికూడా ఇలాగే ముగుస్తుందని నాకు ముందుగానే తెలిసినట్టుగా అనిపించింది. ధీర విషయంలో నా భయం నిజమైనందుకు సంతోషపడుతున్నానా!? అని ఒక్కక్షణం గిల్టీగా అనిపించింది.

ధీరకి పెళ్లిచూపులు అనుకున్నప్పటినుంచీ ఏదో తెలీని టెన్షన్. సగం భయం, సగం సంతోషం కలగలిసిన చిత్రమైన ఫీలింగ్. సిగరెట్లు తాగే, డ్రింక్ చేసే అలవాటున్న కూతురికి పెళ్లిచేయాల్సిన తల్లికి, ఆ పెళ్లిని నాలుగు కాలాలపాటు నిలబెట్టాల్సిన బాధ్యత ఉన్న తల్లికి ఆమాత్రం టెన్షన్ ఉండటం సహజమేనేమో.

తను చెప్పిన మాటకి నేను ఏం అంటానా!? అన్నట్టు నా ముప్పయి రెండేళ్ల బాధాశిఖరం.. నా అయిదేళ్ల ఒంటరి దుఃఖం.. నా నిలువెత్తు దిగులు మేఘం.. గుమ్మంలో ఇంకా అలాగే నిలబడి చూస్తోంది.

''ఎవరు?'' సాధ్యమైనంత మామూలుగా, క్లుప్తంగా అడిగాను.

''ఇట్ డజంట్ మేటర్'' ధీర అంతే క్లుప్తంగా చెప్పింది.

ఎలాంటి ప్రశ్నకు ఎలాంటి సమాధానం? ప్రపంచంలో ఏ తల్లీకూతుళ్ల మధ్యా ఇంత అద్భుతమైన సంభాషణ జరిగి ఉండదేమో.

'ఇట్ డజంట్ మేటర్' అంటే.. అదేమంత చెప్పుకోదగ్గ పెద్ద విషయం కాదనా? ఎవరైనా సరే నీకు అనవసరం అనా? ఎవరైనా ఒకటే.. పెద్ద తేడా ఏంలేదు. నీకు సంబంధం లేదు. నువ్వు చెయ్యగలిగిందీ లేదు అనా? బేతాళ ప్రశ్నలు.

ధీర మొహంలో ఒకలాంటి నిర్లక్ష్యం. ఒకలాంటి ఇనడిఫరెన్స్. అందులో కొంత తెచ్చిపెట్టుకున్న నిర్లక్ష్యం. తనకు నాన్న లేకుండా చేశానని నామీద పెంచుకున్న కోపం. నిజమే.. చిన్నప్పటినుంచీ అది నాన్న అంటే ఎవరో తెలీకుండానే పెరిగింది. అది నా జీవితం. అది నా జీవితానికి సంబంధించిన విషయం అనుకున్నాను. కానీ, అదే విషయానికి తర్వాత ఒకరిముందు నేను దోషిగా నిలబడాల్సి వస్తుందని అప్పట్లో నాకు తెలీదు. విడాకులు తీసుకోవడం నా సొంత విషయం అనుకున్నాను.

జీవితంలో ఒకరితో పంచుకునేవి పంచుకోగలిగినవి ఎన్నో ఉండొచ్చు. కానీ, ఇంకొకళ్లతో పంచుకోలేనిది ఒకటే ఒకటి ఉంది. భార్య భర్తని, భర్త భార్యని. తను అలా పంచుకోలేక పోయింది. తను ఎంతో ఇష్టపడి అమ్మానాన్నల్ని ఎదిరించి మరీ పెళ్లి చేసుకున్న అతను, తన సర్వస్వం అనుకున్న అతను.. ధీరను చూసుకోవడానికి పెట్టుకున్న అమ్మాయితో తన ఇంట్లోనే.. తను ఎంతో అపురూపం అనుకున్న తన బెడ్మీదే..

తన చదువు, తన విజ్ఞానం, తన తెలివితేటలు, అతనంటే తనకున్న ప్రేమ, అభిమానం ఏవీ.. ఒక పనిమనిషి పాటి చేయలేక పోయాయి. శరీరాలు మాత్రమే మాట్లాడగలిగిన భాష ఒకటి ఉంటుందని.. అతను కూడా దానికి అతీతం కాదని తెలుసుకోలేక పోయింది. చాలామందికి అంతేనేమో? శరీరాలతోపాటు ఉన్న మెదళ్లు ఇగోని హర్ట్ చేస్తాయేమో? అహంకారానికి అడ్డు వస్తాయేమో? అమ్మ ఎప్పుడూ అంటుండేది..

'మగవాళ్లు తెలివైన అమ్మాయిల్ని స్నేహితులుగా ఇష్టపడతారు. కానీ, తెలివైన అమ్మాయిల్ని భార్యలుగా చేసుకోవడానికి మాత్రం ఇష్టపడరు' అని.

వాళ్లలో ఉండే బోలుతనాన్ని, బలహీనతల్ని, అవలక్షణాలని ఎక్స్‌రే తీసినట్టు తెలుసుకోవడం ఎవరికి మాత్రం సుఖంగా ఉంటుంది? అతను తనతో ఉన్నంతకాలం దేనికోదానికి ఘర్షణ. తర్వాత ఎవరో చెప్పారు.. ఆ అమ్మాయినే తర్వాత అతను పెళ్లి చేసుకున్నాడని, ఒక పాప అని.

అయిదేళ్ల కిందట ఒకరోజు..

''నాన్న ఎవరు?'' అని అనూహ్యంగా అడిగింది ధీర.

ఆయన గురించి చెప్పాక..

''ఒకసారి చూడాలని ఉంది. చూసి వస్తాను!'' అంది.

అతని ఇంట్లో ఒకపూట ఉండి వచ్చింది. అతని భార్యాపిల్లలతో కలిసి హోటల్‌కు వెళ్లి లంచ్ చేసిందంట. తర్వాత బీచ్‌కి వెళ్లి సరదాగా గడిపారట. అంతా చెప్పి..

''ఆ పిల్ల స్థానంలో నేనుకదా ఉండాల్సింది. నువ్వు నన్ను లేకుండా చేశావు'' అంది.

అక్కడికీ.. జరిగిందేంటో తను చెప్పింది. కానీ, ధీర కన్విన్స్ అవలేదు.

''ఇవాళా రేపూ అందరూ అలాగే ఏడుస్తున్నారు. అంతమాత్రానికే డైవోర్స్ తీసుకోవాలా?'' అంది.

ఆ బాధ, ఆ దుఃఖం, తనని అహర్నిశలు వెంటాడే పీడకల.. ఎలా చెబితే దానికి అర్థం అవుతుంది? భర్తని ఇంకొకళ్లతో పంచుకోవడం.. అది ఎవళ్లకి వాళ్లకే తెలుస్తుంది? ఆ స్థానంలో ఉన్నవాళ్లకే తెలుస్తుంది. అలా పంచుకోవడం, పంచుకోగలగడం నాగరికత లక్షణమేమో. తను అంత నాగరికత నేర్చుకోలేక పోయింది.

అప్పటినుంచీ ధీర ప్రవర్తన మారిపోయింది. మొండిగా తయారైంది. బ్యాంక్ పీవోగా సెలెక్ట్ అయి.. ముంబై వెళ్లినప్పటినుంచీ ఇద్దరి మధ్యా ఆ అగాధం ఇంకా పెరిగి పెద్దదైంది. ముంబై వెళ్లిన తర్వాత ఆరు నెలలకు ఒకసారి ఇంటికి వచ్చింది.

''ఎలా ఉందే.. బాంబే లైఫ్?''

''అబ్బా! చాలా ఫాస్ట్ లైఫ్ అమ్మా! జర్నీకే సగంరోజు సరిపోతుంది. అసలు ఇంట్లో ఉండేదే తక్కువ. అంతా హడావుడిగా టెన్షన్ టెన్షన్గా

